ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
శనివారం 28 సెప్టెంబరు 2024

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా..
జగిత్యాల జిల్లాకు తృతీయ బహుమతి
మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకున్న కలెక్టర్



మంత్రి కృష్ణారావు చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న కలెక్టర్

జగిత్యాల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం జగిత్యాల జిల్లాకు రాష్ట్ర స్థాయిలో తృతీయ బహుమతిని ప్రకటించింది. శుక్రవారం రాత్రి హైద్రాబాద్‌లోని గచ్చిబౌలిలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వరల్డ్ టూరిజం సెలబ్రేషన్లలో భాగంగా మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా కలెక్టర్ సత్య ప్రసాద్ బహుమతితో పాటు రూ. లక్ష నగదును అందుకున్నారు. పర్యాటకం, సంస్కృతి సంప్రదాయాలు, వారసత్వ సంపదపై విద్యార్థులకు అవగాహణ కల్పించడమే కాకుండా భవిష్యత్తులో పర్యాటకం వల్ల కలిగే లాభాలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, పర్యాటక అనుబంద రంగాల అభివృద్ధి తదితర అంశాలపై చిన్నప్పటి నుంచే పెంచుకునే అవకాశం యువ క్లబ్బుల ద్వారా విద్యార్థులకు కల్పించినందుకు గానూ ఈ పురస్కారం జగిత్యాల జిల్లాకు దక్కింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం జగిత్యాల జిల్లాలో సుమారు 300 క్లబ్బులు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాకు ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా తృతీయ బహుమతి ప్రకటించడం పట్ల పలు విభాగాలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

వలసదారుల ఆశలు తీరేలా..


బాధితుల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ (ఫైల్)

- గల్ఫ్ బాధిత కుటుంబాలకు సర్కారు భరోసా
- హైద్రాబాద్‌లో 'ప్రవాసీ ప్రజావాణి' ప్రారంభం
- ఎడారి దేశాల్లో మృతి చెందితే రూ. 5 లక్షల పరిహారంపై ఇప్పటికే ఉత్తర్వులు
- హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లా వలస కార్మిక కుటుంబాలు

జగిత్యాల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలతో వలసదారుల ఆశలు చిగురిస్తున్నాయి. ఇటీవల ప్రభుత్వం చేస్తున్న కసరత్తులు గల్ఫ్ బాధిత కుటుం బాలలో భరోసా నింపుతున్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎన్నో ఏళ్లుగా మారని కథ..తీరని వ్యథ గల్ఫ్ కార్మికుల పరిస్థితి...బతుకు దెరువుకు ఉన్న ఊరిని, కన్నవారిని విడిచి ఎడారి దేశాల బాట పడుతున్న వీరికి, వారి కుటుంబీకులకు ఎట్టకేలకు భరోసా లభి స్తోంది. గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి వివిధ సంఘాలు, రాజకీయ పార్టీలు ఎన్నో ఏళ్లుగా ప్రయత్నం చేస్తూనే ఉన్నాయి. ఇటీవల గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. అనేక సమస్యలకు హామీ ఇవ్వడమే కాకుండా, గల్ఫ్‌లో మరణించిన కార్మి కుల కుటుంబాలకు రూ. 5లక్షలు పరిహారం ఇవ్వాలని నిర్ణయించింది. ఈమేరకు ఇటీవల జీవో నంబరు 205 జారీ చేసింది. 2023 డిసెంబర్ 7నుంచి దీనిని అమలు చేయాలని నిర్ణయించింది. ఇక గల్ఫ్ కార్మికుల జీవన స్థితిగతులను అధ్యాయానికి కూడా సలహాకమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటిం చింది. గల్ఫ్ కార్మికుల కుటుంబాల పిల్లలకు గురుకులాల్లో సీట్లు కేటాయించాలని నిర్ణయించింది. ప్రస్తుతం ప్రజాభ వన్‌లో కొనసాగుతున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రత్యేకంగా గల్ఫ్ కార్మికుల కుటుంబాల సమస్యలు తెలుసుకు నేందుకు ప్రవాసీ ప్రజావాణి కౌంటర్లు ఏర్పాటు చేసింది.

సుమారు 15 లక్షల మంది కార్మికులు...

గల్ఫ్ దేశాలలో తెలంగాణ ప్రాంతానికి చెందిన వలస కార్మికులు సుమారు 15లక్షల వరకు ఉంటారని ఒక అంచనా ఉంది. ఇందులో కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 3 లక్షలు, నిజామాబాద్ ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 2.50 లక్షలు, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 1.80 లక్షల మంది వివిధ దేశాలకు పనుల నిమిత్తం వెళ్లినట్లు అంచనాలున్నాయి. జగిత్యాల జిల్లా వాసులు సుమారు 1.20లక్షల మంది విదేశాలకు ఉపాధి నిమిత్తం వలస వెళ్లినట్లు ఓ అంచనా ఉంది. ఇందులో అత్యధికంగా యూఏఈ, సౌదీ అరే బియా కాగా కువైట్, ఓమన్, ఖతార్, బహ్రెయిన్, మలేషియా, సింగపూర్ దేశాల్లో జిల్లాకు చెందిన పలువురు వలస కార్మికులు పనులు చేస్తున్నారు. గత పదేళ్లలో ఏడారి దేశాల నుంచి మరో సుమా రు 15 లక్షల మంది వివిధ కారణాలతో వాపస్ వచ్చి గ్రామాలలో సరైన ఉపాధి లేక ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూస్తున్నట్లు గల్ఫ్ సంక్షేమ సంఘాల నేతలు అంటున్నారు.

ప్రజాభవన్‌లో 'ప్రవాసీ ప్రజావాణి' షురూ...

గల్ఫ్ బాధిత కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కా రానికి హైద్రాబాద్‌లోని ప్రజాభవన్‌లో 'ప్రవాసీప్రజావాణి' కార్యక్రమాన్ని షురూ చేసింది. విదేశాలలో పనిచేసే కార్మికుల సమస్యలను వారి కుటుంబ సభ్యుల ద్వారా తెలుసుకునేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా హైద్రాబాద్‌లోని ప్రజా భవన్‌లో ప్రవాసీ ప్రజావాని కోసం ప్రత్యేక కౌంటర్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ తాటి పర్తి జీవన్‌రెడ్డి ప్రారంభించారు. ఇది ప్రవాసీ కార్మికులకు, కేంద్ర ప్రభుత్వానికి, భారత రాయబార కార్యాలయాలకు మధ్య ఒక వారధిలా ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది.

గల్ఫ్ కార్మిక కుటుంబాల హర్షం...

ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులతో జగిత్యాల జిల్లాలోని గల్ఫ్ కార్మికులు కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. జగిత్యాల జిల్లా నుంచి వేల మంది ఉపాధికోసం గల్ఫ్ దేశాలకు వెళ్తొస్తున్నారు. వారిపై ఆధారపడిన కుటుంబీకులకు లక్ష మందికి పైగా ఉన్నారు. కేరళ తరహాలో ప్రవాసీ సంక్షేమ (ఎన్ఆర్ఐ) పాలసీ విధానాన్ని అమలు చేయాలని కార్మిక సంఘాలు ఏళ్లుగా కోరుతున్నాయి. కానీ గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. గల్ఫ్ దేశాల్లో ఉపాధి పొందుతున్న కార్మికులు ఏటా వివిధ కారణాలతో అక్కడే మృత్యువాత పడుతున్నారు. ఏటా జగిత్యాల జిల్లాకు చెందిన వారు పదుల సంఖ్యలో విగత జీవులుగా స్వగ్రామాలకు వస్తున్నారు. ఇలాంటి దయనీయ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం గల్ఫ్ దేశాల్లో మృతి చెందిన కుటుంబాలకు రూ. 5లక్షల పరిహారం ఇవ్వాలని నిర్ణయించడం ద్వారా బాధిత కుటుంబాలకు ఆర్థిక స్వాంతన చేకూరుతుంది.

గల్ఫ్ వలస జీవులకు ఓదార్పు



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఎన్ఆర్ఐ విధానాలు గల్ఫ్ వలస జీవులకు ఓదార్పును అందిస్తున్నాయి. గల్ఫ్ కార్మిక సంఘాల నేత లు కొన్ని సంవత్సరాలుగా చేసిన ప్రయత్నాల ఫలితంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ప్రవాసీ కార్మికులకు, కుటుంబ సభ్యుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలను ప్రభుత్వం తీసుకుంటుండడం సంతోషకరము.

- మంద భీమ్‌రెడ్డి, టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ నాయకులు

హామీ నిలబెట్టుకున్నారు..



కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ హామీనిచ్చింది. దానిని నెరవేర్చేదిశగా ఉత్తర్వులు ఇచ్చింది. తాజాగా ప్రవాసీ ప్రజావాణి కార్యక్రమం చేపట్టింది. ఈ నిర్ణయాలతో కార్మికుల కుటుంబాలకు న్యాయం జరుగుతుంది. జిల్లాకు చెందిన వలస కార్మికుల కుటుంబాలకు ప్రయోజనం కలుగుతుంది.

చాంద్ పాషా, గల్ఫ్ కార్మిక సంక్షేమ సంఘం, టీపీసీసీ నాయకులు

మహిళలు ఆర్థికంగా ఎదగాలి
ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 27 :మహిళా సంఘాల ఆర్థిక స్వాలంబనకు ప్రభుత్వం కృషిచేస్తుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం సోమన్‌పల్లి గ్రామానికి చెందిన మహిళ సంఘ సభ్యురాలు మహిళాశక్తి ద్వారా ఏర్పాటు చేసుకున్న ఐకాన్ బ్యూటీ పార్లర్‌ను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఇదే స్ఫూర్తితో మహిళ సంఘాల సభ్యులు మంచి యూనిట్లను నెలకొల్పి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే అన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు సహాయ సహకారాలను అందిస్తానని తెలిపారు. డీఆర్‌డీవో రఘు వరణ్, మున్సి పల్ వైస్‌చైర్మన్ గోళి శ్రీనివాస్, ఏపీఎం గంగాధర్, టీవీ సత్యం, టీవీసూర్యం పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు ఇబ్బందులు లేకుండా చూడాలి
మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ సంతోష్

గొల్లపల్లి, సెప్టెంబరు 27: రాబోయే ధాన్యం కొనుగోళ్లకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని గొల్లపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ సం తోష్ అన్నారు. గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో శుక్రవారం మొదటి పాలకవర్గం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వానికి, ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి, పాలకవర్గ సభ్యులు, గొల్లపల్లి ప్రత్యేకాధికారి సాయిబాబా, మార్కెట్ కార్యదర్శి ఫెయిజొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

రాయికల్, సెప్టెంబరు 27: రైతులు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు సకాలంలో చెల్లించి సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలని చైర్మన్ ఏ నుగు ముత్యం రెడ్డి అన్నారు. మండలంలోని భూపతిపూర్ సహకార సంఘం సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 2023-24 వార్షిక నివేదికను ఆదాయం, ఖర్చులను సంఘ కార్యదర్శి చంద్రశేఖర్ చదివి వినిపించారు. వార్షిక సంవత్సరం రూ.88 లక్షల విలువైన ఫర్టిలైజర్‌ను అమ్మడం జరిగిందన్నారు. రైతులకు ఎల్లవేళలా యూరియా, కాంప్లెక్స్ ఎరువులను, విత్తనాలను అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు.

జగిత్యాలలో ఉద్రిక్తత..?

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 27 : జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత్రి ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. జిల్లా కేంద్రంలోని ఇస్లాంపుర, పురాణీపేటకు చెందిన ఇద్దరు వేర్వేరు మతాలకు చెందిన వ్యక్తులు ఇష్టపడి వివాహం చేసుకున్నారు. ఇద్దరు మేజర్లు కావడం, వారిది జగిత్యాల పట్టణం కావడంతో పట్టణ పోలీసులను ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న పలువురు జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్‌కు చేరుకోవడంతో ఘర్షణ వాతావరణం తలపించింది. వివాహం చేసుకున్న వేర్వేరు మతస్థులకు చెందిన ఇద్దరు ఒక్కటిగా మాట్లాడడంతో సమస్య సర్దుమణిగింది.

ప్రభుత్వ ఆసుపత్రి ఘటనపై ఫిర్యాదు...

జగిత్యాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని పని చేస్తున్న నర్సింగ్ స్టాఫ్ తమపై కావాలనే కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ జగిత్యాల టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణానికి చెందిన నరేష్ తమ విధులకు ఆటంకం కలిగిస్తూ ఫోన్ ద్వారా అనవసరంగా విడియోలు తీస్తూ ఇబ్బందులకు గురి చేశాడంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు.

బ్రిడ్జి మరమ్మతులు చేపట్టాలి

బీర్‌పూర్, సెప్టెంబరు 27: ప్రమాదం జరుగకముందే బ్రిడ్జి మరమ్మతు పనులు చేపట్టాలని జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. శుక్రవారం బీర్‌పూర్ నుంచి ఇందిరానగర్ వెళ్లే ప్రధాన రహదారి మార్గంలో ఎస్సారెస్పీ కాలువపై ఉన్న బ్రిడ్జి సైడ్ గోడ కూలుతున్న విషయం తెలుసుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా వసంత మాట్లాడుతూ ప్రమాదం జరుగక ముందే త్వరిత గతిన మరమ్మతు పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా సూచించారు. ఆమె వెంట కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచంధర్ రావ్, మాజీ ఎంపీపీ కొల్ముల రమణ, మాజీ ఉప సర్పంచ్ హరీష్, నాయకులు జలేంధర్, రాజేశం, శ్రీనివాస్ ఉన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 27 : పౌష్టికాహారంతోనే గర్భిణులకు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని సీడీపీవో మమత అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస సెక్టార్‌పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం పోషణమాసం కార్యక్రమంలో భాగంగా పోషణమాస ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు శ్రీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు చేశారు. అంగన్‌వాడీ టీచర్లతో, ఆశాలతో పోషణ మాసం ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో ఎంపీవో రవిబాబు, సూపర్‌వైజర్ రాజశ్రీ, అంగన్‌వాడీటీచర్లు, పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం ఆదర్శనీయం

ప్రభుత్వవిప్ లక్ష్మణ్‌కుమార్

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 27: మూడు తరాల ఉద్యమ నా యకుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని ఆయన జీవితం అంద రికీ ఆదర్శనీయం అని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని స్థానిక అంగడి బజార్‌లో గల కొండా లక్ష్మణ్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులు అర్పిం చారు. ఈ కార్యక్రమంలో బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, టీపీసీసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బండ శంకర్, మున్సిపల్ మాజీ చైర్మన్ గిరి నాగ భూషణంతో పాటు పద్మశాలి సంఘ బాధ్యులు పాల్గొన్నారు.

●దేశ సేవకు అంకితమైన ఉద్యమాల ఊపిరి కొండా లక్ష్మణ్ బాపూజీ అని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని స్థానిక అంగడిబజార్‌లో గల విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, అదనపు కలెక్టర్‌లు రాంబాబు, గౌతమ్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ రఘువరణ్, బీసీ సంక్షేమ అధికారి సాయిబాబా, కమిషనర్ సమ్మయ్య, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, పద్మశాలి సంఘ అధ్యక్షుడు గంగాధర్ పాల్గొన్నారు.

● జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ రాంబాబు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించగా, రాంబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి, బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి, ఆర్డీవో మధుసూధన్‌గౌడ్, ఏవో హన్మంతరావు, బీసీ వెల్ఫేర్ అధికారి సాయిబాబా, డీపీవో రఘువరణ్, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

●పట్టణంలోని స్థానిక అంగడి బజారులో గల బాపూజీ విగ్రహానికి జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ పూల మాల వేసి నివాళులు అర్పించారు. జడ్పీ మాజీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు పాల్గొన్నారు.

●జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సమి యొద్దీన్ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ జయంతి వేడుకలు నిర్వహించారు.

●ఎస్‌కేఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకొని కళాశాల ప్రిన్సిపాల్ అరిగెల అశోక్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

●ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పొలాస, జగిత్యాలలో కొండా లక్ష్మణ్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.

జగిత్యాల ఆర్డీవో కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రప టానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యాలయ బాధ్యులు తపేజ్‌ఉల్ హుస్సేన్, కుమారస్వామి పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురి మండలంలో స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ పోరాట యోధుడు, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ధర్మపురి మున్సిపల్, మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో, పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో వేర్వేరుగా నిర్వహించిన వేడుకల్లో భాగంగా పలువురు లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, ఎంపీపీ ఎడ్ల చిట్టిబాబు, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ గంగాధర్, ఎంపీవో నరేష్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ అజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ పట్టణంలో పద్మశాలి సేవా సంఘం, యు వజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, సంఘం అధ్యక్షుడు తాటిపాముల విశ్వనాథం, సతీష్, కుల సంఘ సభ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

●రాయికల్ తహసీల్దార్ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తహసీల్దార్ ఖయ్యూం, నాయబ్ తహసీల్దార్ పాల్గొన్నారు.



జగిత్యాలలో లక్ష్మణ్ బాపూజీకి నివాళులు అర్పిస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి

●రాయికల్ మండల పరిషత్ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఎంపీడీవో చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.


మెట్‌పల్లి టౌన్: పట్టణంలో శుక్రవారం కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద పద్మశాలి సేవ సంఘం ఆధ్వర్యంలో వేడుకలను జరిపారు. కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, కాంగ్రెస్ సీనియర్ నా యకులు జువ్వాడి కృష్ణారావు, పద్మశాలి సేవ సంఘం అధ్యక్షులు రాజారం వేర్వేరుగా బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రావు, మున్సిపల్ కమిషనర్ మోహన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు జెట్టి లింగం, తిప్పిరెడ్డి అంజిరెడ్డి, పద్మశాలి సంఘం నాయకులు సత్యనారయణ, శ్రీనివాస్, ఆనంద్, విష్ణు పాల్గొన్నారు.

కోరుట్ల : కొండ లక్ష్మణ్ బాపూజీ చేసిన తెలంగాణ ఉద్యమం మరవలేనిదని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. శనివారం మున్సిపల్, పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలో ఎమ్మెల్యే పాల్గొన్నాడు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లను అర్పిం చారు.

●ఆధర్శనీయుడు కొండ లక్ష్మణ్ బాపూజీ అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. పట్టణంలోని కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి మున్సిపల్ చైర్మెన్ అన్నం లావణ్య -అనిల్, పద్మశాలి సంఘ నాయకులతో కలిసి నివాళ్లను అర్పించారు. పద్మశాలి సంఘ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, కౌన్సిలర్లు , పద్మశాలి సంఘ అధ్యక్షుడు ప్రసాద్ పాల్గొన్నారు.

నరసింహుడి సన్నిధిలో కమలానంద స్వామి పూజలు

ధర్మపురి, సెప్టెంబరు 27: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని శ్రీ కమలానంద భారతి స్వామి శుక్రవారం రాత్రి సందర్శించారు. కృష్ణా జిల్లా కేసరిపల్లి చిదానందాశ్రమం భువనేశ్వరి పీఠాధిపతులు కమలానంద స్వామి స్థానిక లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ శేష వస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈవో సంకటాల శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, వేదపండితులు పాలెపు ప్రవీణ్ కుమార్ శర్మ, ఉప ప్రదాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, అర్చకులు నేరెళ్ల వంశీకృష్ణ, చక్రపాణి కిరణ్ సముద్రాల వంశీక్రిష్ణ, నేరెళ్ల విజయ్, బొద్దిపర్తి కళ్యాణ్, పాల్గొన్నారు.





చేనేత కార్మికులకు చేయూత

హుజూరాబాద్, సెప్టెంబరు 27: చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత నందించేందుకు సిద్ధంగా ఉందని చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు కె విద్యాసాగర్ అన్నారు. హుజూరాబాద్ చేనేత సంఘం 71వ వార్షిక, 82వ మహాసభ శుక్రవారం నిర్వహించారు. చేనేత కార్మికులు ప్రస్తుత అభిరుచికి తగిన విధంగా వస్త్రాలు తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జనార్దన్, సంతోష్‌కుమార్, అజారి వహబ్, శ్యాంసుందర్‌రెడ్డి, జీవన్ కుమార్, రాజయ్య, ఎలిగేటి ఉపేందర్, యాదగిరి, మహాదేవ్, వెంకటయ్య, సత్యనారాయణ, ప్రభాకర్, సుమలత పాల్గొన్నారు.

సిర్సపల్లిలో తెలంగాణ వైద్య మండలి తనిఖీలు

హుజూరాబాద్ రూరల్, సెప్టెంబరు 27 : హుజూరాబాద్ మండలంలోని సిర్సపల్లి గ్రామంలో తెలంగాణ వైద్య మండలి పరిషత్ మెంబర్, పబ్లిక్ రిలేషన్ కమిటీ ఛైర్మన్ నరేష్ కుమార్ శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. మండలంలోని సిర్సపల్లిలో నకిలీ ఆర్‌ఎంపీ డాక్టర్ యాంటీబయోటిక్స్, స్టిరాయిడ్స్ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇస్తున్నట్లు తనిఖీల్లో వెల్లడైంది. ఆర్‌ఎంపీపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని తెలంగాణ వైద్య మండలి ఛైర్మన్‌కు సిఫారసు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పనిచేసిన ఆర్‌ఎంపీ వైద్యుడు విచారణలో నిజాలు వెల్లడైనందున చట్ట ప్రకారం కేసు నమోదుకు సిఫారసు చేశామన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు. హెచ్‌ఆర్‌డీఏ ప్రెసిడెంట్ వెంకటస్వామి, హెచ్‌ఆర్‌డీఏ సెక్రటరీ డాక్టర్ గౌతమ్ ఉన్నారు.

బదిలీల మార్గదర్శకాలు విడుదల

గణేశ్‌నగర్, సెప్టెంబరు 27: టీజీఎన్‌పీడీసీఎల్‌లో బదిలీల మార్గదర్శకాలను ఆ సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి శుక్రవారం విడుదల చేశారు. ప్రస్తుత ఉద్యోగంలో జూలై 30, 2024 నాటికి రెండేళ్లు పూర్తిచేసుకున్న 50 శాతం ఉద్యోగులను బదిలీచేయడానికి ఉత్తర్వులను విడుదల చేశారు. క్షేత్రస్థాయి సిబ్బందిలో జూనియర్ లైన్‌మెన్ నుంచి లైన్ ఇన్‌స్పెక్టర్ వరకు డివిజనల్ అధికారి ఉన్న సెక్షన్ నుంచి మరో సెక్షన్‌కు బదిలీ చేయనున్నారు. సబ్ ఇంజనీర్లు, అకౌంట్స్ సిబ్బంది, క్షేత్రస్థాయి సిబ్బందిలో జూనియర్ అకౌంట్స్ అధికారి నుంచి ఫోర్‌మెన్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్లు, సాధారణ ఉద్యోగులను ఎస్‌ఈ బదిలీ చేయనున్నారు. ఆపై స్థాయి ఉద్యోగులు, ఇంజనీర్లను సీఎండీ బదిలీ చేయనున్నారు. సబ్ ఇంజనీర్ ఆపై స్థాయి బదిలీకి అర్హత కలిగిన ఉద్యోగులు, ఇంజనీర్ల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. కాగా ఆయా సంఘాల నాయకులకు బదిలీ నుంచి మినహాయింపు ఇచ్చారు. ఉద్యోగులైన దంపతులతో పాటు 30, సెప్టెంబరు 2025 లోపు పదవీ విరమణ చేసేవారికి, వితంతువు, దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారికి బదిలీ నుంచి మినహాయింపు ఇచ్చారు. ఈనెల 28లోగా బదిలీకి అర్హులైన వారి జాబితాను రూపొందించాల్సి ఉంటుంది. 30న జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. అక్టోబరు 4న సాయంత్రం ఐదు గంటలలోగా ప్రాపర్ చానల్లో దరఖాస్తుల స్వీకరణ నిలిపివేస్తారు. అక్టోబరు 7న బదిలీల ఉత్తర్వు లు జారీ చేస్తారు. 9వ తేదీన ఉద్యోగి రిలీవ్ కావాల్సి ఉంటుంది. 8 నుంచి బదిలీలపై నిషేధం ప్రారంభమవుతుంది

బావిలో పడి వివాహిత మృతి

మానకొండూర్, సెప్టెంబరు 27: మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన మడ్డి అనిత (38) అనే వివాహిత వ్యవసాయబావిలో పడి మృతి చెందిందని సీఐ కర్రె స్వామి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మడ్డి అనిత-మడ్డి సమ్మయ్య దంపతులు శుక్రవారం తమ వ్యవసాయ పొలం వద్దకు పశువులకు గడ్డి కోయడానికి వెళ్లారు. అనిత బావి ఒడ్డు నుంచి నడుచుకుంటూ వెళుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని అగ్నిమాపక సిబ్బంది సహాయంతో బావిలో నుంచి మృతదేహాన్ని బయటికి తీశారు. అనిత తల్లి భూదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

పాత కక్షలతో దాడి
ఒకరికి తీవ్ర గాయాలు

తిమ్మాపూర్, సెప్టెంబరు 27: మండలంలోని కొత్తపల్లి గ్రామం వద్ద పాత కక్షలతో శుక్రవారం పలువురు దాడి చేసిన ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎల్‌ఎండీ ఎస్సై వివేక్ తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మలహర్ మండలం, పెద్దతుండ్ల గ్రామానికి చెందిన కందుగుల శ్రీనివాస్ అనే వ్యక్తి తన స్నేహితుడు మధుతో కలిసి ద్విచక్రవాహనంపై రామంచ గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. రామంచ గ్రామానికి చెందిన వనాల శ్రీనివాస్, గొట్టిపర్తి రవిగౌడ్, మెరుగు రమేశ్‌గౌడ్, అంబిగాల శ్రీనివాస్ మరి కొందరితో కలిసి బైక్‌ను అడ్డగించారు. రాళ్లు, కర్రలతో దాడి చేశాడు. ద్విచక్ర వాహనంపై ఉన్న మధు అక్కడి నుంచి పారిపోయాడు. శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రూ.7,400 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, సెప్టెంబర్ 27: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,400 రూపాయలు పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు 36మంది 186క్వింటాళ్లు విడి పత్తి, 30మంది రైతులు 44క్వింటాళ్లు గోనె సంచుల్లో పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,400, కనిష్ఠ ధర 4వేలు చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

శిక్షణ తరగతులకు తరలిరావాలి

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 27: సర్వీసు నిబంధనలు, లీవ్ రూల్స్ తదితర అంశాలపై ఆదివారం ఉదయం 9గంటలకు ఎస్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి సానా కిషన్ ఒక ప్రకటనలో కోరారు. కరీంనగర్‌లోని భగత్‌నగర్ వివేకానంద విద్యానికేతన్ పాఠశాలలో నిర్వహించే శిక్షణ తరగతులకు రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.సదానందగౌడ్, సీనియర్ నాయకుడు గణేశ్ హాజరై అవగాహన కల్పిస్తారని అన్నారు. సంఘ బాధ్యులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

జమ్మికుంట రూరల్, సెప్టెంబర్ 27: జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం డిగ్రీ దూర విద్యలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలకు 30వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ ఓదేలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ఇల్లందకుంట, సెప్టెంబరు 27: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాధికారి కోరె రాములు అన్నారు. మండలంలోని సిరిసేడు జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ వాలీబాల్ జట్టు ఎంపిక పోటీలను మండల విద్యాధికారి శుక్రవారం ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 16 మండలాలలోని 17 ఏళ్ల లోపు బాల,బాలికలు 32 జట్లు పాల్గొన్నాయి. ఎంఈవో రాములు మాట్లాడుతూ.. ప్రతిభ చాటిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. బాలుర విభాగంలో మొదటి బహుమతి చొప్పదండి, ద్వితీయ బహుమతి కరీంనగర్ జట్లు గెలుపొందాయి. బాలికల విభాగంలో మొదటి బహుమతి కొత్తపల్లి, ద్వితీయ బహుమతి చొప్పదండి జట్లు గెలుపొందాయి. కార్యక్రమంలో ఎంపీడీవో పుల్లయ్య, ఉపాధ్యాయులు సత్యనారాయణ, వేణు, గోపాల్, రమ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కేసులను ఎత్తి వేయించాలి

చిగురుమామిడి, సెప్టెంబరు 27: హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ నవాబుపేట గ్రామ ప్రజలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తి వేయించాలని యువకులు విజ్ఞప్తి చేశారు. గ్రామంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో పలువురు మాట్లాడారు. 2018 అక్టోబరులో ప్రసుత్త మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ తమ గ్రామానికి వచ్చిన సందర్భంగా సమస్యలపై నిలదీస్తే అక్రమంగా కేసులు పెట్టారని చెప్పారు. దీంతో కోర్టు చుట్టూ తిరుగలేక ఇబ్బందులు పడుతున్నామని, కేసులు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో బుర్ర శ్రీనివాస్, బోయిని వంశీకృష్ణ, దోమ శ్రీనివాస్, బుర్ర అశోక్, చెప్యాల వేణు, రాగూరు నరేందర్‌సింగ్, కోక్కిస సతీష్, గూళ్ల రాజు, పోలవేణి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

పేలిన ఆర్టీసీ బస్సు టైరు..
ప్రయాణికులు సురక్షితం

తిమ్మాపూర్, సెప్టెంబరు 27: ప్రయాణికులతో వెళుతున్న ఆర్టీసి బస్సు టైరు ఒక్కసారిగా పేలింది. ఈ సంఘటనలో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. హుస్నాబాద్ డిపోకి చెందిన పల్లె వెలుగు ఆర్టీసి బస్సు ప్రయాణికులతో కరీంనగర్ నుంచి హుస్నాబాద్‌కు బయలుదేరింది. మండలంలోని నుస్తులాపూర్- కొత్తపల్లి గ్రామాల మధ్యలో రాజీవ్ రహదారిపై బస్సు వెనక టైరు ఒక్క సారిగా పేలింది. డ్రైవర్ వెంటనే బస్సు నిలిపివేయడంతో ఎవరికి గాయాలు కాలేదు. బస్సులో సుమారు వంద మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం.



సహకార సంఘాన్ని సందర్శించిన తమిళనాడు బృందం

పంట రుణాలపై ఆరా

చొప్పదండి ప్యాక్స్‌ను సందర్శించిన తమిళనాడు బృందం

చొప్పదండి, సెప్టెంబరు 27 : చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని తమిళనాడు డీసీసీసీ బ్యాంకు బృందం శుక్రవారం సందర్శించి రైతులకు ఇస్తున్న పంట రుణాలను అడిగి తెలుసుకున్నది. సంఘం అభివృద్ధి, రైతుల ప్రయోజనంకోసం తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. పంట పెట్టుబడి కింద ఎకరానికి ఇరవై వేల రూపాయల రుణాన్ని అందిస్తున్నట్లు అధికారులు చెప్పారు. రైతుల కోసం ఎరువులు, విత్తనాలు, పురుగుల నివారణ మందులను తక్కువ ధరకే విక్రయిస్తున్నట్లు బృందానికి వివరించారు. బృందం లో టెస్కాబ్ సీటీఐ విజయ్ శంకర్, మంగళూరు బర్డ్ డీజీఎం స్వాతి, పీడీసీ రిసోర్స్ పర్సన్ సత్యనారాయణ, సంఘం అధ్యక్షుడు వెల్మ మల్లారెడ్డి, సీఈవో కళ్లెం తిరుపతి రెడ్డి, ఉపాధ్యక్షుడు ముద్దం మహేష్‌గౌడ్, డైరెక్టర్లు గుర్రం ఆనందరెడ్డి, లంబు రాజిరెడ్డి, సిబ్బందితో పాటు తమిళనాడుకు చెందిన 40 మంది ప్యాక్స్ కార్యదర్శులు పాల్గొన్నారు.

తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

● యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి



తెలంగాణ చౌక్‌లో భిక్షాటన చేస్తున్న యూఎస్ఎఫ్ఐ నాయకులు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 27 : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్(యూఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కరీంనగర్ ఆర్ట్స్ కళాశాల నుంచి తెలంగాణ చౌక్ వరకు భిక్షాటన చేస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో అనేకమంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8నెలలు గడుస్తున్నప్పటికీ పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యపై స్పందించకపోవడం సిగ్గుచేటు అన్నారు. ప్రభుత్వం స్పందించి బకాయిలు విడుదల చేయకపోతే ప్రజాభవన్ ముట్టడికి పిలుపునిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాహుల్, నంద గణేష్, నగర నాయకులు అభిలాష్, శ్రీకాంత్, ఉమామహేశ్వర్, కార్తీక్, రంజిత్, సంపత్ కుమార్, శీకాంత మహమ్మద్ లతోపాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్సీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, సెప్టెంబరు 27: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జూలై, ఆగస్టు 2024 లో నిర్వహించిన ఎమ్మెస్సీ (మైక్రోబయాలజీ, ఫుడ్ సైన్స్ డేటా సైన్స్ మ్యాథమెటిక్స్) రెండో, నాలుగో సెమిస్టర్ ఫలితాలను శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్ వి శ్రీరంగ ప్రసాద్ శుక్రవారం విడుదల చేశారు. ఫలితాలు శాతవాహన యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

ఉమ్మడి జిల్లాకు జూడో ఓవరాల్ చాంపియన్‌షిప్



రాష్ట్ర జూడో పోటీల్లో చాంపియన్లుగా నిలిచిన క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 27: తెలంగాణ పాఠశాలల క్రీడా సమాఖ్య రాష్ట్రస్థాయి జూడో పోటీల ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు సాధించింది. హన్మకొండలో ఈనెల 25, 26, 27 తేదీల్లో నిర్వహించిన అండర్-14 రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ జూడో పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ప్రతిభచాటి ఆరు బంగారు, రెండు రజిత, రెండు కాంస్య పతకాలతో చాంపియన్లుగా నిలిచారు. ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు 30 కిలోల విభాగంలో ఆర్ కార్తిక్ బంగారు, 35 కిలోల విభాగంలో టి హర్షిత్‌రెడ్డి బంగారు, 45 కిలోల విభాగంలో యు శివసాయి బంగారు, 40కిలోల విభాగంలో బి యశ్వంత్ బంగారు, 44 కిలోల విభాగంలో బి వర్షిత బంగారు, ఎ సుష్మిత బంగారు పతకాలును సాధించారు. అలాగే 50కిలోల విభాగంలో బి గణేశ్ రజతం, 50కిల్లో పై విభాగంలో రియాన్ కాంస్య, 23 కిలలో విభాగంలో ఎం లహరి రజత, 32 కిలోల విభాగంలో జె షణ్ముఖశ్రీ కాంస్య పతకాలను సాధించి చాంపియన్లుగా నిలిచారని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా చాంపియన్లుగా నిలిచిన జిల్లా జట్లను డీఈవో జనార్దాన్‌రావు, డీవైఎస్‌వో వి శ్రీనివాస్, జిల్లా జూడో సంఘం అధ్యక్ష,కార్యదర్శులు కె అనంతరెడ్డి, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఎల్‌వి రమణ, శ్యాం, శ్రీధర్ అభినందించారు.

భిన్న వాతావరణం.. సాగు ప్రశ్నార్థకం,

● అధిక వర్షాలపై రైతుల ఆందోళన

● యాజమాన్య చర్యలు చేపట్టాలంటున్న వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు

హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబర్ 27: జిల్లాలో ఉన్న భిన్న వాతావరణ పరిస్థితులు పంటల ఎదుగుదల, దిగుబడులపై తీవ్ర ప్రభావం పడనుంది. అధిక వర్షాలు కొన్ని రోజులైతే.. ఎక్కువ ఉష్ణోగ్రతలు మరికొన్ని రోజులు ఇలా విభిన్నమైన మార్పులు వెంటవెంటనే చోటు చేసుకోవడం సాగును ప్రశ్నార్థకంగా మారుస్తోంది. ఈ మార్పులు అన్నదాతలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పంట ఎదుగుదల, దిగుబడులపై కనబడని ప్రభావం పడటం వల్ల అధిక నష్టాలను చవిచూసే పరిస్థితి ఉంది వీటిని ఎదుర్కొని సాగును ముందుకు నడిపించాలంటే వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు అత్యవసరం.



కాట్రపల్లి గ్రామంలోని పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు

● వాతావరణ మార్పులతో పంటలపై ప్రభావం

వాతావరణ మార్పులు వరి, పత్తి, కూరగాయల సాగుపై ఎక్కువ ప్రభావం ఉంటుంది. పంటల ఎదుగుదల, దిగుబడులతో పాటు కొత్తరకమైన తెగుళ్లతో కర్షకులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వర్షంతో మొత్తబడిన నేలలు అధిక ఉష్ణోగ్రతల వల్ల గట్టి పడటంతో వేరు వ్యవస్థ దెబ్బతిని ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది. పంటలు నీటిని తీసుకునే పరిస్థితులు భిన్నంగా మారడంతో దిగుబడుల తగ్గడానికి కారణమవుతుంది. అధిక వేడి, ఉబ్బ వాతావరణం వల్ల చీడపీడల ఉధృతి పెరిగి కర్షకులపై రసాయన మందుల ఖర్చు అధికంగా పడనుంది. చెరువులు, బావుల కింద వేసిన వరి చిరుపొట్ట దశలో ఉండగా, పత్తి కాయలు పడే దశలో ఉంది. ఇప్పటికే వర్షాలు, వరదలతో పంటలు నష్టపోయిన రైతులు అధిక పెట్టుబడులు పెట్టడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. వాతావరణ మార్పుల వల్ల ఎకరానికి సాధారణ పెట్టుబడుల కంటే రూ. 5 వేలు అధిక భారం పడనుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూరగాయలు నేలకు తాకొద్దు

కూరగాయల తోటల్లో దుంపలకు నీటి నిల్వ వల్ల పోషకాలు తగ్గుతాయి. వెంటనే లోతైన కాల్వలు ఏర్పాటు చేసి వర్షం నీరు తొలగించి 19:19:19 లేదా 14:35:14 వంటివి పైపాటు పోషకాలు నేరుగా పిచికారి ద్వారా అందించాలి. కాయల సంఖ్య ఎక్కువగా ఉం డి నేలకు తాకి నీళ్లలో ఉంటే తగిన జాగ్రత్త లు పాటించాలి.

వరిలో సస్యరక్షణ చర్యలు

ముందుగా వేసిన వరి చిరుపొట్ట దశలో ఉండగా ఆలస్యంగా వేసిన మరికొన్ని పొలాలు పిలక దశకు చేరాయి. వర్షాలకు నత్రజని ఎక్కువగా మొక్కకు అందుతుంది. రైతులు రెండోసారి యూరియాను పూర్తిగా తగ్గించాలి. మొక్క ఎదుగుదల, పచ్చదనం బట్టి అసలు వేయకపోవడమే మంచిది. ఎదుకంటే అగ్గి తెగులు ఆశిస్తే నష్టం ఎక్కువగా ఉంటుంది. అఖరి దఫాగా 10-15 కిలోల పోటాష్‌తో పాటు 15-20 కిలోల యూరియా కలిపివేస్తే సరిపోతుంది. కాపర్ శిలీంధ్ర నాశనులను ఇప్పుడు పిచికారి చేయవద్దు. అధిక వర్షానికి ఉక్కపోత వాతావరణం ఉంటే గాలిలో అధిక తేమ ఉండి సుడిదోమ ఆశిస్తుంది. వర్షాలకు వరి పసుపు రంగుకు మారడం, కొనల చివరి ఎండిపోయి నట్లుగా తెల్లగా ఉంటుంది. వానలు తగ్గిన తర్వాత పైపాటుగా ఎరువులు వేయాలి.

● పత్తిలో నీరు ఉండొద్దు

పత్తి పంటలో అధిక వర్షాలకు నీరు నిల్వ ఉంటే కాల్వలు తీసి మురుగు లేకుండా తొలగించాలి. ఈ వర్షానికి ఎండుతెగులు వస్తుంది. నివారణకు కార్బండిజమ్ ఒక గ్రాము లీటరు నీటిలో కలిపి మొక్కల మొదళ్ల వద్ద పంపు నాజిల్ తీసి ద్రావణం పోయాలి. వర్షం తగ్గిన వెంటనే 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ వేసుకోవాలి.

పెట్టుబడి ఖర్చు పెరుగుతోంది



నాకున్న వ్యవసాయ పొలంలో వరి పంట సాగు చేస్తున్నా. ఒకరోజు వర్షం, ఒకరోజు ఎండ వేడితో పంటలలో వివిధ రకాలతెగుళ్ల పెరిగిపోతున్నాయి. వాటిని నివారించేందుకు యూరియా వాడకం పెరగటం ద్వారా పెట్టుబడి ఖర్చు పెరుగుతోంది. పంట చేతి కందేలోపు ఇంక ఎంత ఖర్చు పెరుగు తుందో తెలియటం లేదు.

-బోయిని సమ్మక్క, మహిళ రైతు, కనుకులగిద్దె

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



రైతులు మారుతున్న వాతావరణ మార్పు లను దృష్టిలో ఉంచుకుని పంటలను ఆశించే చీడపీడలను ఎప్పటికప్పుడు గమనించాలి. దాని కి అనుగుణంగా వ్యవసాయాధికారుల సూచ నలతో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. అధిక ఉష్ణోగ్రత, ఉబ్బ వాతావరణంతో వివిధ తెగుళ్లతో వరి, పత్తిపై ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

-చాడ భూమిరెడ్డి, మండల వ్యవసాయాధికారి, హుజూరాబాద్

కొనసాగుతున్న ఎస్సారెస్పీ నీటి విడుదల

జగిత్యాల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీరాం సాగర్ ప్రాజెక్టు నుంచి దిగువ గోదావరిలోకి శుక్రవారం వరద నీరు విడుదల కావడం కొనసాగింది. ప్రాజెక్టుకు చెందిన మూడు వరద గేట్లను ఎత్తి దిగువన గల గోదావరిలోకి 9,372 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఎస్సారెస్పీలోకి 52,982 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 37,362 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

చిల్లపల్లిని సందర్శించిన పీఆర్ జేసీ

మంథనిరూరల్, సెప్టెంబర్ 27: మండలంలోని చిల్లపల్లి గ్రామాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ జాయింట్ కమిషనర్ శ్రీనివాస్ శుక్రవారం సందర్శించారు. అధికారులు, మహిళలు ఆయనకు స్వాగతం పలికారు. గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫ్రెండ్లీ ఉమన్ పంచాయతీ అవా ర్డుల ఎంపిక కోసం ఈ గ్రామాన్ని గతంలో అధి కారు లు ప్రతిపాదించగా ఇందులో భాగంగా పీఆర్‌జేసీ సందర్శించినట్లు అధికారులు తెలిపారు. ఈసందర్భంగా మహిళా సంఘాలతో ఆయన ప్రత్యేకంగా మాట్లా డారు. సంఘాల ద్వారా మహిళలు సాధించిన విజ యాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య, ఎంపీడీవో పూర్ణచందర్, కార్యదర్శిరాం కిషోర్, అధికారులు పాల్గొన్నారు.

జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్‌గా వెలిచాల

● అధ్యక్ష, కార్యదర్శులుగా అమిత్‌రావు, మల్లేష్



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 27: కరీంనగర్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్‌గా వెలిచాల రాజేందర్‌రావు ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా డాక్టర్ చెన్నాడి అమిత్‌రావు, బి మల్లేష్ గౌడ్‌లు ఎన్నికయ్యారు. నగరంలోని ఓ ప్రవేటు హోటల్‌లో నిర్వహించిన కబడ్డీ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఏకగ్రీవంగా సభ్యుల మద్దతుతో నిర్వహించిన ఈ ఎన్నికల్లో ప్యాట్రన్‌గా డాక్టర్ ఈ ప్రసాద్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సిహెచ్ సంపత్‌రావు, వైస్ చైర్మన్‌గా పి అనూకర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా మల్లేష్ గౌడ్, మల్లేష్, సునీల్ రెడ్డి, నిర్వహణ కార్యదర్శిగా సుధాకర్, టెక్నికల్ చైర్మన్‌గా ఎస్ లక్ష్మీనారాయణ, రెఫరీ బోర్డు చైర్మన్‌గా డి వీరన్న, సంయుక్త కార్యదర్శిగా ఏ పద్మ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికకు తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఈ రాంచందర్, జిల్లా క్రీడా శాఖ యోగ కోచ్ ఈ కిష్టయ్య, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కోశాధికారి సిద్దారెడ్డి, చొప్పదండి పిడి కె కృష్ణలు పరిశీలకులుగా వ్యవహరించారు. ఎన్నికైన కార్యవర్గాన్ని డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, పలు క్రీడా సంఘాల బాధ్యులు, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

క్రైం కార్నర్

చెరువులో మునిగి బర్లకాపరి మృతి

బుగ్గారం సెప్టెంబరు 27 : మండలంలోని చిన్నాపూర్ గ్రామంలో శుక్రవారం చెరువులో మునిగి బర్ల కాపరి మృతి చెందాడు. స్థానిక ఎస్సై శ్రీధర్ రేడ్డి,కుటుంబ సభ్యుల వివరాల మేరకు సుంకే పేద్ద గంగయ్య (55) అనే వ్యక్తి చిన్నాపూర్ గ్రామస్థుల బర్రెలకు కాపరిగా పని చేస్తున్నాడు. రోజులాగే శుక్రవారం గెదేలను మేతకు తీసుకెళ్లాడు. ఉదయం చెరువులోకి వెళ్లిన గేదెలను ఒడ్డుకు చేర్చే క్రమంలో గంగయ్య ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ఊపిరి రాడక చనిపోయాడు. గంగయ్య భార్య సుంకే లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి..

కరీంనగర్ క్రైమ్, సెప్టెంబర్ 27: కరీంనగర్ శివారులోని రేకుర్తి కల్వర్టువద్ద శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాంనగర్‌కు చెందిన సుధగుని శ్రీకర్ గౌడ్ (27) మృతి చెందాడని కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి తెలిపారు. శ్రీకర్ గౌడ్ రేకుర్తి నుంచి రాంనగర్‌లోని తన ఇంటికి బైక్ పై వెళ్తుండగా రోడ్డుపై బైకు అదుపుతప్పి కిందపడి తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి సుదగోని శ్రీనివాస్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

బోయినపల్లిలో..

బోయినపల్లి, సెప్టెంబరు 27: బోయినపల్లి మండలం వరదవెల్లి స్టేజీ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మండలంలోని వరదవెల్లి చెందిన అంజయ్య తన ద్విచక్ర వాహనంపై కొదురుపాకకు వెళ్తున్నాడు. గంగాధర మండలం రంగారావుపల్లికి చెందిన రాయమల్లు (50), దేవయ్య, ఓద్యారం గ్రామానికి చెందిన ఎల్లయ్య ముగ్గురు కలిసి ఒకే ద్విచక్ర వాహనంపై బోయినపల్లి వైపు నుంచి ఓద్యారం వెళ్తున్నారు. ఈ క్రమంలో వారు అంజయ్య వాహనాన్ని వెనుక వైపు నుంచి అతివేగంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో రాయమల్లు, దేవయ్య, ఎల్లయ్యకు గాయాలవగా ఆస్పత్రికి తర లించారు. రాయమల్లు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పృథ్వీధర్ గౌడ్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

బోయినపల్లి, సెప్టెంబరు 27: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి పురుగుల మందు తాగగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎస్సై పృథ్వీధర్ గౌడ్ వివరల ప్రకారం.. మండలంలోని విలాసాగర్‌కు చెందిన పండుగ ఎల్లయ్య (58) కొన్నేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 18న మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. భార్య లక్ష్మి గమనించడంతో చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం చనిపోయాడు. లక్ష్మి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

మల్యాల, సెప్టెంబరు 27: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధురాలు బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తక్కళ్లపల్లికి చెందిన కడారి నీలమ్మ(71) గురువారం రాత్రి ఇంటి వరండాలో పడుకుంది. కుటుంబసభ్యులకు శుక్రవారం వేకువజామున కనిపించకపోవడంతో చుట్టు పక్కల వెతికారు. వ్యవసాయ బావిలో మృతిచెంది ఉండటాన్ని గుర్తించారు. నీలమ్మ కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోందని, దీంతో జీవితంపై విరక్తిచెంది ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలి కొడుకు దిలీప్ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

స్వగ్రామం చేరిన మృతదేహం

ఇల్లంతకుంట, సెప్టెంబరు 27: ఆర్థిక ఇబ్బందులతో దుబాయ్‌లో పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న వలస జీవి మృతదేహాన్ని శుక్రవారం గ్రామానికి తీసుకొచ్చారు. ఇల్లంతకుంట మండలం వంతడుపుల గ్రామపంచాయతీ పరిధిలోని తెనుగువానిపల్లెకు చెందిన బోయిని గణేష్ (34) అనే వలసజీవి ఉపాధికోసం ఆరేళ్ల క్రితం దుబాయ్ వెళ్లాడు. స్వగ్రామంలో ఇంటిని నిర్మించడంతో దాదాపు రూ.20లక్షల వరకు అప్పులు అయ్యాయి. దీంతో మానసిక ఆందోళన చెందిన గణేష్ గత నెల 11న దుబాయిలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గల్ఫ్‌కార్మికుల రక్షణసమితి అధ్యక్షుడు గుండెల్లి నర్సింహులు, శేఖర్‌గౌడ్, ఆకునూరి మహేందర్ సహకారంతో మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. గణేష్‌కు భార్య రేణుక, కుమారుడు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సారా విక్రయిస్తే కఠిన చర్యలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 27: పల్లెల్లో సారా తయారీ, అమ్మకాలు సాగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గంభీరావుపేట మండలం నాగంపేటతండా శివారులో సారా తయారీకి వినియోగించే ముడి పదార్థాలు, సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకోగా శుక్రవారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్ లో వివరాలు వెల్లడించారు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డికి చెందిన అజ్మీర నాజం కారులో సారా ముడి సరుకులను రవాణా చేస్తున్నారనే సమాచారంతో వాహన తనిఖీలు నిర్వహించారు. నాగంపేటతండా శివారులో కారును ఆపి సోదాలు చేయగా అందులో 50 కిలోల బెల్లం, 10 కిలోల పటిక, ఐదు లీటర్ల సారా ప్యాకెట్లు లభించాయి. కారుతో పాటు ముడి పదార్థాలు, సారా ప్యాకెట్లను స్వాధీనపర్చుకుని రవాణాదారుడు నాజంపై కేసు నమోదు చేశామని సీఐ శ్రీనివాస్ వివరించారు.

నలుగురికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 27: ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. ఎల్లారెడ్డిపేట, రాగట్లపల్లి గ్రామాల్లోని అనుదీప్, లక్ష్మణ్ ద్విచక్రవాహనంపై వేములవాడ రాజరాజేశ్వరస్వామిని దర్శించుకొని వస్తున్నారు. వెంకటాపూర్ గ్రామంలోని అంజయ్య, శ్రీనివాస్ బైక్‌పై హరిదాస్‌నగర్ శివారులోకి వెళ్లి కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై నుంచి స్వగ్రామానికి తిరిగుతున్న క్రమంలో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో నలుగురు గాయపడగా సిరిసిల్లలోని ఆసుపత్రికి తరలించారు.

వివాదాలకు కేరాఫ్ రాయికల్ పోలీస్‌స్టేషన్

● ఎస్సైల పనితీరుపై విమర్శలు

● మూడు నెలల వ్యవధిలో ఇద్దరు ఎస్సైలపై వేటు



రాయికల్ పోలీస్‌స్టేషన్

రాయికల్, సెప్టెంబరు 27 : రాయికల్ పోలీస్‌స్టేషన్ వివాదాలకు కేరాఫ్‌గా మారింది. ఇక్కడ పని చేస్తున్న ఎస్సైల తీరుపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మూడు నెలల వ్యవధిలో ఇద్దరు ఎస్సైలపై వేటు పడటంతో ప్రజలు విస్మయానికి గురవుతున్నారు. రాయికల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైలుగా విధులు నిర్వహించిన ఇద్దరు ఎస్సైలపై వేటు పడటంతో ఈ స్టేషన్ ఎస్సైగా రావడానికి పలువురు విముఖత చూపుతున్నారు. అటవీ ప్రాంతం కావడంతో గతంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతంగా రాయికల్ మండలం పేరు తెచ్చుకుంది. అటు ఎన్‌కౌంటర్లు, ఇటు నక్సల్స్ దాడులతో రాయికల్ మండలం అట్టుడికినట్లు ఉండేది. ఇసుక, కలప, గుడుంబా, గంజాయివంటి వాటి అక్రమ రవాణా, భూతగాదాలు, వివిధ రకాల పంచాయతీలు వంటి వాటి పరిష్కా రాలతో రాయికల్ పోలీస్ సిబ్బందికి చేతినిండా పని ఉండేది. దీంతో రాయికల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తమకు అనుకూలంగా నియమ నిబంధనలు రూపొందించుకుని వాటిని పాటించేవారని పలు ఆరోపణలు ఉన్నాయి. తాజాగా రా యికల్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న అశోక్ క్రమశిక్షణ చర్యలు ఉల్లంఘించడంతో ఉ న్నతాధికారులు మందలించారని తెలిసింది. అతనికంటే ముందు ఎస్సైగా విధులు నిర్వ హించిన అజయ్ ఏసీబీ వలలో పడటంతో సస్పెన్షన్‌కు గురయ్యాడు. ఈ స్టేషన్‌లో పని చేసిన పలువురు పోలీసులు గతంలో సస్పెండ్ కావడంతో రాయికల్ పోలీస్‌స్టేషన్ లో ఉద్యోగం అంటేనే పోలీసులు హడలిపోతున్నారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్సైలు తరచూ ఏదో ఒక వివాదంలో ఇరుక్కోవడంతో ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళుతున్నాయి.

డివైడర్‌ను ఢీకొట్టిన వ్యాన్

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 27: ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై డీసీఎం వ్యాన్ వెనుక టైర్ శుక్రవారం ఒక్కసారిగా పగిలిపోవడం తో దూసుకుపోయి డివైడర్‌ను ఢీకొట్టింది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. కామారెడ్డి నుంచి జగిత్యాల వైపునకు నూనె లోడుతో వెళ్తోంది. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ యువకుడి మృతి

ఎస్పీ కార్యాలయానికి ఎస్సై అటాచ్..?

కోరుట్ల, సెప్టెంబరు 27 : కుటుంబ కలహాలతో ఈనెల 23న ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ బొల్లారపు శివప్రసాద్ (35) చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో గురువారం రాత్రి మృతి చెందడంతో జిల్లాలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో ముందస్తు చర్యల్లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పెద్ద ఎత్తున పోలీసు బలగాలను మొహరించారు. కోరుట్ల పట్టణం లోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన బొల్లారం కవితకు 15 ఏళ్ల క్రితం జగిత్యాల జిల్లా మంచినీళ్ల బావి ప్రాంతానికి చెందిన శివ ప్రసాద్ (35)తో వివాహం జరిగింది. వివాహం జరిగిన కొన్ని రోజుల వరకు వారి జీవనం సజావుగా సాగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండేళ్ల నుంచి దంపతుల మధ్య కుటుంబ కలహాలు మొదలయ్యాయి. దీంతో కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో ఆగస్టు 24వ తేదీన శివప్రసాద్ భార్య ఫిర్యాదు చేసింది. కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో 2వ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న శ్వేత శివ ప్రసాద్‌కు పలు మార్లు కౌన్సెలింగ్ నిర్వహించింది. ఈ క్రమంలో ఈ నెల 20న ఎస్ఐ శ్వేత శివ ప్రసాద్‌ను కౌన్సెలింగ్ నిర్వహించి అం దరి ముందే చేయి చేసుకోవడంతో అవమాన భారంతో జగిత్యాలలోని తన ఇం టికి వెళ్లాడు. మరో మారు 22న కౌన్సెలింగ్‌కు రావాల్సి ఉండగా పోలీస్ స్టేషన్ కు వెళ్తే ఎం జరుగుతుందోనని భయపడి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. గమనించిన చుట్టు పక్కల వారు చికిత్స నిమిత్తం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం బంధువులు హైదరాబా దులోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. గాంధీ ఆసుపత్రి నుంచి శివప్రసాద్ సోదరి అతని పరిస్థితిని వివరిస్తూ కోరుట్ల ఎస్ఐ తన అన్నపై చేయి చేసుకు న్నదని అది అవమానంగా భావించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తీసిన వీడియో సామాజిక మాధ్యమంలో పోస్టు చేసింది. వీడియో వైరల్ కావడంతో ఎస్ఐ శ్వేత వ్యవహారం భయటకు రావడంతో చర్చనీయాంశంగా మారింది. చికిత్స పొందుతున్న శివప్రసాద్ శుక్రవారం ఉదయం మృతి చెందడంతో ఎస్ఐ శ్వేతపై ఎస్పీ అశోక్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేసి తన కార్యాలయానికి పిలి పించుకున్నారు. ఎస్సై శ్వేతను వీఆర్‌కు అటాచ్ చేసినట్లు సమాచారం. గతంలో కోరుట్ల ఎస్సైగా పని చేసిన కృష్ణకుమార్ ఎఖీన్‌పూర్ గ్రామంలో జరిగిన కేసులో ఆరోపణలు ఎదుర్కొని ఎస్పీ కార్యాలయానికి అటాచ్ కాగా నెల రోజుల క్రితం ఎస్సైగా పని చేసిన కిరణ్ కుమార్ కూడా ఎస్పీకి ఆటాచ్‌పై వెళ్లాడు. ప్రస్తుతం యువకుడి ఆత్మహత్య కేసులో ఆరోపణలు ఎదుర్కోంటున్న ఎస్ఐ శ్వేత కూడ ఎస్పీ కార్యాలయానికి ఆటాచ్ కావడం చర్చనీయశంగా మారింది.

పోలీస్ స్టేషన్‌కు బారీ బలగాలు

ఎస్ఐ వేధించాడన్న ఆరోపణలో జగిత్యాల పట్టణానికి చెందిన శివప్రసాద్ మృతి చెందగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టి భారీ బలగాలను మొహరించారు. మెట్ పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర రావు పర్యవేక్షణలో కోరుట్ల సీఐ సురేష్ బాబు ఎస్ఐలు శ్రీకాంత్ గౌడ్, నవీన్, శ్యాంరాజు ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ పర్య వేక్షణ నిర్వహించారు. కోరుట్ల పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ అశోక్ కుమార్ సందర్శించి సంఘటనపై విచారణ చేపట్టారు. కథలాపూర్, మెట్‌పల్లి మండలంలో జరిగిన వివిధ సంఘటనలపై మెట్‌పల్లి డీఎస్పీతో విచారణ జరిపి తీసుకో వాల్సిన జాగ్రత్తలను వివరించారు.

బందోబస్తు మధ్య శివ ప్రసాద్ అంత్యక్రియలు

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 27 : కుటుంబ కలహాలతో ఈ నెల 23న ఆత్మహ త్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో గురువారం రాత్రి మృతి చెందిన బొల్లారపు శివ ప్రసాద్ (35) అంత్యక్రియలు పోలీసు బందోబస్తు నడుమ శుక్రవారం నిర్వహించారు. శుక్రవారం శివ ప్రసాద్ కుటుంబ సభ్యులు హైదరాబాద్ నుంచి మృత దేహాన్ని పోస్టుమార్టం అనంతరం జగిత్యా లలోని చింత కుంటవాడకు తరలించారు. దీంతో శివ ప్రసాద్ కుటుంబంలో తీవ్ర విషాద చాయలు అలుముకున్నాయి. అంత్యక్రియలు నిర్వహించే సమయంలో మృతదేహంతో కుటుంబ సభ్యులు ధర్నాకు దిగుతారనే అనుమానంతో జగిత్యాల, కోరుట్ల ప్రాంతానికి చెందిన పోలీసులు మఫ్టీలో శివ ప్రసాద్ ఇంటి వద్దకు చేరుకుని అంత్యక్రియలు పూర్తయ్యే వరకు బందోబస్తు చేపట్టారు. అంతకు ముందే జిల్లాకు చెందిన ఓ పోలీస్ అధికారి శివ ప్రసాద్ కుటుంబ సభ్యులను కలిసి చర్చలు జరిపి కుటుంబానికి న్యాయం చేస్తామనే హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ ఘటనపై మృతుడి తల్లి నర్సవ్వ జగిత్యాల పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఎలాంటి అనుమానాలు లేవని పేర్కొంది.



నివాళులు అర్పిస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత



మల్లాపూర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో...



గొల్లపల్లిలో పాల్గొన్న పద్మశాలి సంఘం నాయకులు



మెట్‌పల్లిలో నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే, ఇతరులు



రాయికల్ మున్సిపల్ చైర్మన్, పద్మశాలి సంఘం సభ్యులు

ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు. జిల్లా వ్యాప్తంగా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనం గా నివాళులు అర్పించారు. ఆ సందర్భంగా ఆయన తెలంగాణ తొలి దశ ఉద్యమంలో పాల్గొని చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు.



వెల్గటూర్‌లో..



పెగడపల్లిలో..



కోరుట్లలో నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే, ఇతరులు



మెట్‌పల్లి రూరల్ మండలంలోనిఆత్మనగర్‌లో..



ధర్మపురి మండల పరిషత్ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

వైద్య పరీక్షలు నిర్వహించడం అభినందనీయం

మెట్‌పల్లి మున్సిఫ్ కోర్టు మేజిస్ట్రేట్ అరుణ్ కుమార్

మెట్‌పల్లి టౌన్, సెప్టెంబరు 27: మెట్‌పల్లి న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించడం అభినంనీయమని మెట్‌పల్లి మున్సిఫ్ కోర్టు మేజిస్ట్రేట్ అరుణ్ కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని కోర్టు అవరణలో మెట్‌పల్లి న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఫార్చ్యూన్ మెడికేర్ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరంను మేజిస్ట్రేట్ చేతుల మీదుగా ప్రారంభించారు. వైద్యు లు న్యాయవాదులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశా రు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు పుప్పాల లింబాద్రి, ఉపాధ్యక్షుడు రాంబాబు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, న్యాయవాదులు వెంకట నర్సయ్య, రాజుమహ్మద్, వెంకటస్వామి, ఒజ్జెల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతుల సొమ్ము స్వాహా చేసిన పాలకవర్గాలను రద్దు చేయాలి

పెగడపల్లి, సెప్టెంబరు 27: అభివృద్ధి పేరుతో రైతుల సొమ్ము స్వాహా చేసిన సహకార సంఘాల పాలక వర్గాలను రద్దు చేయాలని పెగడపల్లి మండల కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పెగడపల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మేం అవినీతి రహితులం, సంఘాల బలోపేతానికి కృషి చేస్తాం అంటూ ప్రగల్భాలు పలికినవారు విజిలెన్సు అధికారుల తనిఖీలలో లక్షలలో అవినీతి చేసినట్లు వెల్లడయిందన్నారు. అవినీతికి పాల్పడిన ఉద్యోగులను తొలగించడంతో పాటు సంఘాలను రద్దు చేయాలని వారు కోరారు. సమావేశంలో పార్టీ అధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్, నాయకులు మల్లారెడ్డి, విజయ భాస్కర్, కడారి తిరుపతి, పూసాల తిరుపతి, సత్తిరెడ్డి, సుదీర్, వంశీధర్‌రావు ఉన్నారు.

ప్రధానోపాధ్యాయుడి ఔదార్యం

బైక్‌పై పిల్లలను బడికి తీసుకువస్తున్న మాస్టారు

రాయికల్, సెప్టెంబరు 27: బడి పిల్లల కోసం ఓ ప్రధానోపాధ్యాయుడు చూపిస్తున్న ఔదా ర్యం ఆదర్శంగా నిలుస్తోంది. ఇంటి నుంచి బడి దూరం కావడంతో తన ద్విచక్ర వాహనంపైనే పిల్లలను నిత్యం తీసుకురావడాన్ని పలువురు ప్రశంసిస్తున్నారు. మండలంలోని ధర్మాజీ పేటలోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాడిగా విధులు నిర్వ హిస్తున్న బాసమల్ల జనార్ధన్ రావు తన పాఠశాలలో చదువు తున్న చిన్నారుల దాదాపు 3 కి.మీ. దూరంలోని తండా నుంచి కాలినడకన పాఠశాలకు వస్తూ ఇబ్బందులు పడుతున్నారని, తరచూ గైర్హాజరు అవుతున్నారని తెలుసుకున్నారు. దీంతో ప్రతి రోజు ఉదయం తన బైక్ మీద పిల్లలను ఎక్కించు కుని పాఠశాలకు తీసుకుని వస్తున్నారు. బాసమల్ల జనార్ధన్‌రావు చేస్తున్న కృషిని రాయికల్ ఎంఈవో రాఘవులు, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చెరుకు మహేశ్వరశర్మ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రజలు ప్రశంసిస్తున్నారు.

'మహిళలకు మహాలక్ష్మి పథకం వరం'

కోరుట్ల రూరల్, సెప్టెంబరు 27 : మహిళలకు మహాలక్ష్మి పథకం వరం అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాలలో మహాలక్ష్మి పథకంలో రూ. 500 సబ్సిడీకి ఎంపికైన మహిళ లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పత్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డితో కలిసి అందించారు. ఈ సందర్భంగా జువ్వాడి కృష్ణారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులను మహిళలు సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మెన్ సాయిరెడ్డి, కొంతం రాజం, సత్యనారాయణ గౌడ్, గంగాధర్ గౌడ్, సంజీవరెడ్డి, శశీంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

హోరా హోరీగా పాఠశాలల క్రీడల పోటీలు

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 27 :. జిల్లా కేంద్రంలోని వివేకానంద మినీ స్టేడియంలో జిల్లా స్థాయి పాఠశాలల ఆటల పోటీలు మూడవ రోజు హోరా హోరిగా కొనసాగాయి. అండర్-14 బాలికల కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ విభాగాల్లోపోటీలు నిర్వహించగా వివిధ పాఠశాలల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. వాలీబాల్‌లో మేడిపెల్లి విన్నర్ నిలవగా, జగిత్యాల మండల జట్టు రన్నర్‌గా నిలిచింది. కబడ్డీ పోటీల్లో మెట్‌పెల్లి విన్నర్‌గా నిలవగా, గొల్లపెల్లి రన్నర్‌గా, ఖోఖో పోటీల్లో మేడిపెల్లి విన్నర్‌గా నిలవగా, కథలాపూర్ జట్టు రన్నర్‌గా నిలిచిందని డీఈవో జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను జగిత్యాల రూరల్ ఎంఈవో గాయత్రి, ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్‌ల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి లక్ష్మీరామ్ నాయక్, పేట అధ్యక్ష, కార్యదర్శులు విశ్వప్రసాద్, అశోక్, పీడీలు కృష్ణ ప్రసాద్, అజయ్, కోఠేశ్వర్ రావు, భాస్కర్, వేణు, దయాకర్, రవి ఉన్నారు.

నేడు జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ ఎంపిక పోటీలు...

జిల్లా కేంద్రంలోని మిని స్టేడియంలో శనివారం జిల్లా స్థాయి అండర్ -17 బాలికల విభాగంలో హ్యాండ్ బాల్ ఎంపిక పోటీలను నిర్వహిం చనున్నట్లు డీఈవో శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాల్గొననున్న క్రీడాకారులు అర్హత పత్రాలతో హాజరు కావాలని కోరారు.

ప్రసాద పథకంలో కొండగట్టు అభివృద్ధి

● పరిశీలించిన స్థపతి, ఇంజనీరింగ్ అధికారులు

మల్యాల, సెప్టెంబరు 27: కేంద్ర ప్రభుత్వ ప్రసాద పథకంలో భాగంగా కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో అభివృద్ధి భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు గాను శుక్రవారం స్థపతి, ఇంజనీరింగ్ అధికారులు కొండగట్టులో పర్యటించారు. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి, స్థానిక ఎంపీ బండి సంజయ్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక చొరవతో ప్రసాద పథకంలో రూ.50 కోట్లు వెచ్చించనున్నారు. ఇందులో భాగంగా కొండగట్టులో తెలంగాణ ప్రాజెక్ట్ పర్యటక శాఖ కన్సల్టెంట్, ప్లానర్, దేవాదాయ శాఖ ఎస్‌ఈ, స్థపతి కొండపైన చేపట్టాల్సిన అభివృద్ధి పనులను దేవస్థానం అధికారులు, ఆలయ అర్చకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా తాగునీటి సౌకర్యం, వసతిగదులు, మరుగుదొడ్లు వాటి కోసం దేవస్థానం అధికారులు వివరించారు. ఈవో రామకృష్ణరావు, స్థానాచార్యులు కపీందర్, వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణతో కూడిన విద్య

● ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హైమదీబేగం

కథలాపూర్, సెప్టెంబరు 27 : అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణతో కూడిన విద్య అందుతుందని గ్రామీణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హైమదీబేగం పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన మండల స్థాయి పోషణ మహా కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఎప్పటికప్పుడు ఎత్తుకు తగిన బరు వు కొలతలు వేస్తున్నట్టు చెప్పారు. గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అక్షరా భ్యాసం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వినోద్, ఎంపీడీవో శంకర్, ఏపీఎం నరహరి, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.



గర్భిణీకి సీమంతం చేస్తున్న సూపర్‌వైజర్

ఇండ్లల్లో పండ్ల మొక్కలు నాటాలి

మెట్‌పల్లి రూరల్ : పోషక విలువలు లభించే పండ్ల మొక్కలను ఇండ్లల్లో పెంచుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షమీంసుల్తానా అన్నారు. పోషణ్ మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం మండలంలోని పెద్దాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో కలిసి మొక్కను నాటి, గర్భిణులు, బాలింతలకు, మహిళలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్ర మంలో అంగన్‌వాడీ టీచర్ భూదేవి, ఆయాలు మంగళ, బాబాయి, ఆశాకార్యకర్త సునీత, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల వారోత్సవాల్లో భాగంగా వాకతాన్

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 27: అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని స్థానిక మినీ స్టేడియం నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు వాకతాన్ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా సమాజంలో వృద్ధుల గౌరవం, వారి శ్రేయస్సు కోసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి రాగిజావా, మొలకెత్తిన విత్తనాలు, మిల్లెట్ లడ్డూలు అందజేశారు. ఆల్ సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్, ఉద్యోగ పెన్షనర్‌ల సంఘ అధ్యక్షుడు గంగారాజం, సీడీపీవో మమత, ఉన్నారు.

సహజ జీవనశైలితోనే వ్యాధులు దూరం

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 27: అసంతులన జీవన శైలితో స్త్రీలలో హార్మోన్లకు సంబంధించిన వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉందని, నాణ్యమైన జీవనశైలితోనే వ్యాధులు దూరం అవుతాయని ప్రముఖ స్త్రీ వైద్యనిపుణురాలు డాక్టర్ వినీల అన్నారు. పట్టణంలోని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీకళా శాలలో హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్యస్ఫూర్తి సదస్సుకు ఆమె ము ఖ్య అతిథిగా హాజరయ్యారు. సహజ జీవన శైలితోనే ఆరోగ్యం నిలకడగా ఉంటుందని, యువతులలో ప్రధానంగా థైరాయిడ్ హార్మోన్ లోపాలు, వెంట్రుకలు రాలి పోవడం, వివాహం తర్వాత గర్భాధారణ సమస్యలు వస్తుడడం రోజువారి జీవనశైలి కారణం అన్నారు. అనంతరం డాక్టర్ వినీలను కళాశాల బృందంచే సన్మానించారు.

ఆయిల్‌పామ్ తోటలపై అవగాహన

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 27 :జగిత్యాల రూరల్ మండలంలోని పొరండ్ల గ్రామంలో ఆయిల్‌ఫామ్ తోటలో తీసుకునే జాగ్రత్తలపైన, చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయిల్‌ఫామ్ సాంకేతిక సలహాదారు డా. రంగ నాయకులు శుక్రవారం గ్రామపంచాయితీ కార్యాలయంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో లోహియా మేనేజర్ విజయ్‌భరత్, హరీష్, అన్వేష్, పాల్గొన్నారు.

కల్లెడలో విగ్రహం ధ్వంసం

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 27 : జగిత్యాల రూరల్ మండలంలోని కల్లెడ గ్రామంలో ఓ దేవుడి విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేసినట్లు గ్రామస్థులు ఆరోపించారు. కల్లెడ గ్రామ శివారులో గతంలో ఓ దేవుడి విగ్రహాన్ని ప్రతి ష్ఠించారు. దీనిని ఆకతాయి వ్యక్తులు ధ్వంసానికి పాల్పడ్డట్లు తెలిసింది. విషయం గ్రామంలో వైరల్‌గా మారింది. అప్రమత్తమైన దుండగులు ఆదేవుడి విగ్రహాన్ని యధావిధిగా యధాస్థానంలో అమర్చినట్లు సమాచారం.

త్వరలోనే కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం

● చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల, సెప్టెంబరు 27: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని త్వరలోనే కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం కూడా లబ్దిదారులకు అందజేయనుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మల్యాలలో శుక్రవారం 75మందికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, 25మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే సత్యం లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.500 లకే గ్యాస్ సిలిండర్, రూ.2లక్షల వరకు రైతు రుణమాఫీ చేసిందని అన్నారు. నియోజకవర్గంలో ఇళ్లు లేని నిరుపేదలకు 3500ఇళ్లు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మునీంధర్, విండో చైర్మన్ రాంలింగారెడ్డి మాజీ ఎంపీపీలు ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, ఆగంతపు రవళీ, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, ముత్యం శంకర్, సతీష్‌రెడ్డి, వంశీధర్, పోతాని రవి, మల్లేశంగౌడ్, నర్సింహారెడ్డి, తిరుపతిరెడ్డి, తిరుపతి, అనిల్ పాల్గొన్నారు. మల్యాల బ్లాక్ చౌరస్తా వద్ద రేషన్‌దుకాణం లేక ప్రజలు మల్యాల, ముత్యంపేటకు వెళ్లాల్సి వస్తుందని దీంతో అసౌకర్యానికి గురవుతున్న దృష్ట్యా రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని కొక్కుల రఘుబాబు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఘనంగా వరల్డ్ టూరిజం డే

కోరుట్ల, సెప్టెంబరు 27 : మున్సిపల్ అధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవా 2024 కార్యక్ర మంలో భాగంగా శనివారం వరల్డ్ టూరిజం డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మిని ట్యాంక్ బాండ్ అవరణలో కమీషనర్ తిరుపతి ఆధ్వర్యంలో పారి శుద్ధ్య కార్యక్రమాలను చెపట్టారు. ఈ సందర్భంగా మొక్కలను నాటి వాటి పరిరక్షణకై టీగార్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ తిరుపతి మాట్లాడారు. కోరుట్ల పట్టణంను స్వచ్ఛ పట్టణంగా తీర్చిదాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆశోక్, ఇంజనీయర్ మహేష్, రమేష్ పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

●చైర్మన్ రాజనర్సింగరావు

కొడిమ్యాల, సెప్టెంబరు 27 : రైతులు సింగిల్ విండో నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని సింగిల్ విండో చైర్మన్ మెన్నేని రాజ నర్సింగరావు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో సాధారణ సమావేశం చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ తీసుకున్న రుణాలను గడువు ప్రకారం చెల్లించినట్లయితె ఇతర రైతులకు రుణాలను అందించడం జరుగుతుందన్నారు. అంతక ముందు సీఈవో గంగాధర్ కార్యాలయ నివేదికను చదివి వినిపించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు సీఈవో గంగాధర్, కార్యాలయ సిబ్బంది, వివిధ గ్రామాలకు చెదిన పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రుల ఆకస్మిక తనిఖీ

కోరుట్ల, సెప్టెంబరు 27 : పట్టణంలోని పలు ప్రవేట్ ఆసుపత్రులను శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి సమీయొద్దిన్ ఆదేశాల మేరకు మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రి నిర్వహణలు వైద్యుల వివరాలను పరిశీలించి సూచిక బోర్డుల ఏర్పాటుపై ఆరా తీసారు. రోగుల వద్ద నుంచి తీసుకుంటున్న ఫీజు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ దనంజయ్‌లతో పాటు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

●పట్టణంలో జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు నిర్వహించిన తనిఖీ తూతూ మంత్రంగా జరిగిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలు ఆసు పత్రుల్లో వైద్యులు లేకున్న వచ్చిన వారికి వైద్య నిర్వహించి మందులు అందిస్తున్నారన్న ఆరోప ణలతో జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు అందడంతో తనిఖీ నామమాత్రంగానే సాగిందని ప్రచారం.

సమస్య తలెత్తకుండా కెపాసిటర్లు బిగించుకోవాలి

ఎస్‌ఈ సాలియ నాయక్

సారంగాపూర్, సెప్టెంబరు, 27: లోఓల్టేజీ సమస్య తల్తెకుండా మోటర్లకు కెపాసిటర్‌లు తప్పనిసరిగా అమర్చుకోవాలని ఎస్‌ఈ సాలియ నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని కోనాపూర్ గ్రామలంలో పొలంబాట కార్యక్రమంలో భాగంగా పంట పొలాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా రైతుల పొలాల్లో వంగిన స్తంబాలను,జోలెగా ఉన్న తీగలను, తెగిన ఉన్న తీగల వివ రాలను వెంటనే తమ దృష్టికి తీసుకు వచ్చినట్లయితే సమస్యలను పరిష్కరిస్తామని తెలినారు. రైతులు తమ మోటర్ల వద్ద నాణ్యమైన పీజ్‌లు, స్టాటర్ డబ్బాలను బిగించుకోవాలని సూచించారు. పశువులను విద్యుత్ ప్రమాదాల నుంచి రక్షించేలా ట్రాన్స్‌ఫార్మర్‌ల చుట్టు కంచెలు ఏర్పాటు చేసేల చర్యలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ డీఈ గంగారం, జగిత్యాల రూరల్ ఏడీఈ హరీష్, ఏఈ సతీస్ రైతులు పాల్గొన్నారు.



కోనాపూర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు.

సంక్షిప్త సమాచారం

కొడిమ్యాల : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆద్వర్యంలో పారిశుద్య సిబ్బంది 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరం ఉన్న వారికి మందులను అందించారు. ఈ వైద్య శిబిరంలో ఎంపీడీవో స్వరూప, ఎంపీవో వాసవి, మెడికల్ ఆఫీసర్ పరమేశ్వరీ, సీహెచ్‌వో రాజశేఖర్, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటనర్సమ్మ, కొడిమ్యాల కార్యదర్శి వంశీవర్ధన్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, కార్యదర్శులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మహాధర్నాకు హాజరు కావాలి

మెట్‌పల్లి టౌన్, సెప్టెంబరు27: గురుకుల పాఠశాల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర రాజధాని హైదారాబాద్‌లోని ఇందిర పార్క్ వద్ద నిర్వహించనున్న మహాధర్నాకు గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు తిరుకోవెల శ్యామ్‌సుందర్ కోరారు. శుక్రవారం పట్టణంలోని పలు గురుకుల పాఠశాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశాస్త్రీయమైన పని వేళలు, పాఠశాలలకు సొంత భవనాల నిర్మాణం, కేర్ టేకర్ నియామకంతో పాటు 24 డిమాండ్లను పరిష్కారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి భూమేశ్వర్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఉపాధ్యయులకు బీమా సౌకర్యం

మల్యాల, సెప్టెంబరు 27: తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే ప్రైవేట్ విద్యాసంస్థల్లో పని చేస్తున్న ఉపాధ్యయులకు భీమా సౌకర్యం కల్పనకు కృషి చేయనున్నట్లు పట్టాభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు అన్నారు. మండలంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో శుక్రవారం పట్టాభద్రుల ఓటు నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రైవేట్ ఉపాధ్యయులకు రూ.10లక్షల జీవితభీమా, రూ.10లక్షల ఆరోగ్యభీమా సంరక్షణ చట్టం తీసుకురావడానికి ప్రయత్నిస్తానని తెలిపారు. ట్రస్మా మండల అధ్యక్షుడు పోకల నరేశ్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రతాప్‌కిషన్‌రావు, గోనే సత్యనారాయణ, తిరుపతి, దయానంద్, అనిల్ పాల్గొన్నారు

కథలాపూర్ : మండలంలోని తాండ్ర్యాలలో శుక్రవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంకు స్పందన లభించింది. ఉదయం నుంచి వివిధ గ్రామాల నుంచి రోగులకు హాజరు కాగా రేకుర్తి కంటి వైద్యుడు ప్రభాకర్ పరీక్షలు నిర్వహించారు. 105 మందికి పరీక్షలు నిర్వహించగా 42 మందికి కంటి శుక్లాల ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. రేకుర్తి వైద్యశాలకు తరలించారు.

మెట్‌పల్లి టౌన్: మెట్‌పల్లి మండల టిపియూఎస్ నూతన కార్యవర్గంను ఎన్నుకున్నాట్లు టిపియూఎస్ నాయకులు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని జ్ఞానోదయ డిగ్రీ కాలేజ్‌లో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. టిపియూఎస్ మండల అధ్యక్షులుగా గన్నారం నరసింహా చారి, ప్రధాన కార్యదర్శిగా చిటికేసి మహేష్‌ను నియామించినట్లు జిల్లా అధ్యక్షులు బోనగిరి దేవయ్య, ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌రావులు తెలిపారు.

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలంలోని మోరపల్లి గ్రామంతో పాటు తదితర గ్రామాల్లో శుక్రవారం ఘనంగా కొండాలక్ష్మణ్‌బాపూజీ జయంతివేడుకలను నిర్వహించారు. లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు.

మల్లాపూర్ : గ్రామాల్లో సీజనలు వ్యాధులు రాకుండా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ వాహిని సూచించారు. శుక్రవారం మండలం లోని కుస్తాపూర్ గ్రామంలో మండల వైద్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సీహెచ్‌వో రామ్‌మోహన్, సూపర్‌వైజర్ ప్రభావతి, ఎమ్‌ఎల్‌హెచ్‌పీ రబియా, పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురి పట్టణంలోని చింతామణి చెరువు వద్ద మున్సిపల్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం స్థానిక లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం పరిసరాల్లో శుభ్రం చేశారు.

మల్యాల: కృష్ణా జిల్లాలో గల చిదానందశ్రమ భువనేశ్వరి పీఠాధిపతి శ్రీకమ లానంద భారతీస్వామి శుక్రవారం కొండగట్టు అంజనే యస్వామిని దర్శించుకున్నారు. ఆలయంకు వచ్చిన వారి బృందంకు ఈవో రామకృష్ణారావు, ఆలయ అర్చకులు స్వాగతం పలికారు.

పెగడపల్లి : జీవో 25 రద్దు చేయాలని కోరుతూ పెగడపల్లి మండల కేంద్రంలో శుక్రవారం ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జిలు దరించి నిరసన తెలిపారు.

గొల్లపల్లి: గొల్లపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జిల్లా ఇంటర్ విద్యాధికారి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ ఏనుగుల మల్లయ్య,